# తూము పనిచేయక అందని నీరు..



చెరువులోకి దిగి తూము రాడ్ పైకి ఎత్తుతున్న రైతులు, నీరు సరిపోక నెర్రెలు వారుతున్న వరి పంట

పరిగి, ఏప్రిల్ 1: చెరువులో నిండుగా నీళ్లున్నా తూము సరిగా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పరిగి మండలం మిట్టకోడూర్ చెరువులో నీరు పుష్కలంగా ఉండగా మొత్తం మూడు

## ఎండుముఖం పడుతున్న వరి పంట

సాగు చేశారు. ఈ రెండింటిలోను ఒక తూము రాడ్ పైకి రావడం లేదు. దీంతో వరి పంటకు నీరు సరిగ్గా అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తూము కింద సుమారు 40 ఎకరాలలో వరి పంటను సాగు చేయగా తూము రాడ్ ఎత్తేందుకు ప్రయత్నించినా రాకపోతుండడంతో నీరు తక్కువ మోతాదులో వస్తున్నాయని రైతులు తెలిపారు. నీరు సరిపోకపోవడం వల్ల లఖ్నాపూర్ ప్రాజెక్టు నీరు కొంత మంది రైతులు వాడుకొని తమ వరి పంటను కాపాడుకుంటున్నారు. దీంతోపాటు కొందరు బోరు నీళ్లు వాడుతున్నారు. కాగా ప్రస్తుతం పంటకు నీరు అవసరమైన దశలో నీరు రాకపోవడంతో రైతులే స్వయంగా చెరువులోకి దిగి తూము రాడ్ ఎత్తే ప్రయత్నం చేసినా పెద్దగా రావడం లేదని వాపోతున్నారు. తద్వారా సుమారు 10 ఎకరాల వరి పంటకు నీరు సరిపోకపోవడంతో ఇప్పటికే పంట పొలంలో నెర్రెలు వారి పంట ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదే పరిస్థితి మరో వారం పది రోజులైతే పంట పూర్తిగా ఎండిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి నీరు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ప్రహరీ లేక పాఠశాలలో మందుబాబుల ఆగడాలు

కొడంగల్, ఏప్రిల్ 1: మండలంలోని అన్నారం గ్రామ ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతి రోజు పాఠశాల ఆవరణలో మందుబాబులు జల్సా చేసుకొని మందుబాటిల్స్‌ను అక్కడే పడేస్తున్నారని, గాజు పెంకులు విద్యార్థులకు ప్రమాదకరంగా మారే పరిస్థితి తలెత్తుతున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు స్థానికులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం లేదన్నారు. పాఠశాలకు ప్రహరీ లేని కారణంగానే ఇటువంటి సంఘటనలు తలెత్తుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మా పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేసి సరస్వతీ నిలయాన్ని కాపాడాలని విద్యార్థులు కోరుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, పాఠశాల ఆవరణలోని చేతి పంపు నీటినే తాగుతున్నట్లు తెలిపారు. తాగునీటి సౌకర్యానికి సంబంధించిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వెంటనే ప్రహరీ నిర్మాణంతో పాటు తాగునీటి సౌకర్యాలను కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో పడి ఉన్న బీరు సీసాలు



మధ్యలోనే నిలిచిపోయిన తాగునీటి సౌకర్యం

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కులకచర్ల, ఏప్రిల్ 1 : కులకచర్ల మండల కేంద్రంలోని చిన్నగుటు సమీపంలో మంగళవారం గ్రామస్తులతో కలిసి సీసీ రోడ్డు పనులు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కులకచర్ల మాజీ ఎంపీటీసీ ఆనందం, మాజీ సర్పంచ్ జ్యోగు వెంకటయ్యగౌడ్, నాయ కులు కృష్ణారెడ్డి, నర్సింహులు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటయ్య, అయ్యలగారి కృష్ణయ్య, వేపూరి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్, ఏప్రిల్ 1: తాండూరు మండలం, బెల్కటూర్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పీఏసీఎస్ డైరెక్టర్ రాఘవేందర్, కుమ్మరి గుండప్ప, నారాయణరెడ్డి అన్నారు.

# తొండపల్లిలో సమస్యల తాండవం

- మూడో వార్డులో నీటి ఇబ్బందులు
- పల్లె ప్రకృతి వనం ఆలనాపాలన కరువు
- రోడ్డు పక్కనే చెత్తా చెదారం



బోసిపోతున్న పల్లె ప్రకృతి వనం

పరిగి, ఏప్రిల్ 1: పరిగి మండలం తొండపల్లి గ్రామంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. గ్రామంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు పెద్ద పీట వేస్తూ పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి కృషి జరుగగా, నేడు పట్టించుకునే వారు కరువై అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. సమస్యలు పరిష్కరించండని అధికారులకు విన్నవిస్తే చూస్తాం, చేస్తామనే కాలయాపన తప్ప పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే ..గతంలో పల్లె ప్రకృతి వనాలంటేనే పచ్చదనానికి మారుపేరుగా నిలిచాయి. నేడు పల్లె ప్రకృతి వనాల పరిస్థితి గతమెంతో ఘన కీర్తిగానే మిగిలిపోయిందనే విమర్శలున్నాయి. గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతివనం ఆలనా



రోడ్డు పక్కనే చెత్త వేసి కాలుస్తున్న దృశ్యం

పాలనా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతోపాటు మొక్కలకు కనీసం ఎండాకాలంలోనైనా నీరు పోస్తే ఏపుగా పెరుగుతాయి. గతంలో కేవలం మొక్కలకు నీరు పోసేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తి ఉండేవాడు. నేడు పట్టింపులేని ధోరణితో పల్లె ప్రకృతి వనంలో మొక్కలను పట్టించుకొనే వారు కరువై అస్తవ్యస్తంగా మారిందని చెప్పవచ్చు. ఇకపోతే గ్రామంలో చెత్త సేకరణకు ట్రాక్టర్ ఉన్నప్పటికీ గతంలో వలె కాకుండా అడపాదడపా సేకరణ జరుగుతుందనే విమర్శలున్నాయి. తద్వారా రోడ్డు పక్కనే చెత్త పారబోసి నిప్పంటిస్తున్నారు. ఇటీవల వేసిన సీసీ రోడ్డు ఎత్తుగా మారడంతో ద్విచక్ర వాహనాలు ఏమాత్రం అజాగ్రత్తగా నడిపినా వాహనదారులు కింద పడిపోతున్నారని, రోడ్డుకు ఇరువైపుల మట్టిని పోయించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సరిగ్గా నిర్మాణం చేపట్టకపోవడంతో మురికినీరు రోడ్డుపై పారుతుండడం గమనార్హం.

తొండపల్లి గ్రామంలోని 3వ వార్డు పరిధిలోని ప్రజలు తాగు నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో బోర్లు లేక, నీటి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నటువంటి బోరులో మోటారు చెడిపోయి చాలా నెలలవుతున్నా, దాన్ని బాగు చేయించేవారు కరువయ్యారని పేర్కొన్నారు. బోరులో నీరు ఉన్నాయని, కనీసం కొత్త మోటారు ఏర్పాటు చేయించాలని సూచించినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో 3వ వార్డు పరిధిలోని సుమారు 50 కుటుంబాల వారు ఊరి చివరన గల బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్నారని గ్రామస్తులు వాపోయారు. మోటార్‌సైకిళ్లు ఉన్న వారు రోజు వాటిపై, మిగతా వారు బిందెలతో మోసుకువస్తున్నారని తెలిపారు. ఇలా గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పలుమార్లు గ్రామకార్యదర్శికి విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కనీసం ప్రత్యేకాధికారి వస్తే చెబుదామంటే అది లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మోటార్‌సైకిల్‌పై తాగు నీరు తీసుకువస్తున్న దృశ్యం



వృథాగా పడివున్న బోరు

## అర్చకులు ఆధ్యాత్మికతను పెంపొందించాలి



సంఘం కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అర్చకులు

దోమ, ఏప్రిల్ 1: అర్చకులు ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేయాలని ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకుర్తి జయతీర్థ చారి అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో డీఎస్ఎస్ ప్రధానకార్యదర్శి కరణం శ్రీకాంత్ రావు నివాసంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకులు తాము పనిచేస్తున్న దేవాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు. వారిలో భక్తి భావనలను పెంపొందించే విధంగా కృషి చేయలన్నారు. సంఘం అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి సభ్యత్వ నమోదును పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కల్యాన్‌రామ్,సభ్యులు నటరాజ్. జగదీష్, రాజశేఖర్ స్వాములు, శ్రీకాంత్‌చారి, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

## ఏడో గ్యారెంటీకి కాంగ్రెస్ తిలోదకాలు



పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, నాయకులు

పరిగి, ఏప్రిల్ 1:కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య విమర్శించారు. నాలుగు వందల ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్నాకు పిలుపునివ్వగా, ఈ ధర్నాలో పాల్గొనకుండా తమను అక్రమ అరెస్టు చేయడం తగదన్నారు. ముందస్తుగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. వెంకటయ్య, నాయకులు హబీబ్, యాదగిరిలను పోలీసులు అరెస్టు చేసి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజల భూములను అమ్ముకుంటారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ తన ఏడవ గ్యారంటీగా ప్రకటించిన కాంగ్రెస్ నేడు ఇంత అప్రజాస్వామికంగా వ్యహరిస్తుందని విమర్శించారు. విద్యా వ్యవస్థను, విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాల్సిన దశలో రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాల భూమి అమ్మకానికి పెట్టడం సరికాదన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేయడం తగదన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు ఉపసంహరించి, వెంటనే వారిని విడుదల చేయాలని, భూముల అమ్మకం ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ధారూరు, ఏప్రిల్ 1: గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలు సహాయ సహకారాలు అందించాలని నర్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుర్వ చంద్రయ్య అన్నారు.మంగళవారం ధారూరు మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో ఎంపీ నిధులు రూ.ఐదు లక్షతో సీసీ రోడ్డు మంజూరు చేయడంతో గ్రామ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు నందు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.



దౌల్తాబాద్, ఏప్రిల్ 1: మండల కేంద్రంతో పాటు దేవర్‌ఫస్లవాద్ గ్రామంలో మంగళవారం నూతనంగా మంజూరు చేసిన నాలుగు హైమాస్ట్ లైట్లను ప్రధాన కూడాలిలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకుడు వెంకట్రావు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# చాయ్ అడ్డాలో యువత వీరంగం

- కూల్ డ్రింక్స్ బాటిళ్లతో కొట్టుకున్న ఇరువర్గాలు
- 40 మందిపై కేసులు నమోదు



కొట్టుకుంటున్న రెండు గ్రూపుల యువకులు

పరిగి, ఏప్రిల్ 1: పోలీస్‌స్టేషన్‌కు సుమారు 500 మీటర్ల దూరంలో రెండు గ్రూపులకు చెందిన యువకులు కొట్టుకొని హంగామా సృష్టించారు. చేతికి ఏది అందితే దానితోనే దాడికి పాల్పడ్డారు. కేవలం మాట్లాడదామని పిలిచి ఒక వర్గం తమపై దాడి చేసినా అదే వర్గం ఇచ్చిన ఫిర్యాదుతో తమపై కేసు నమోదు చేశారని రెండవ వర్గం ఆరోపిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే మార్చి 30వ తేదీ ఆదివారం ఉదయం పరిగి మున్సిపల్ పరిధిలోని తుంకులగడ్డలో గల ఓ టీ స్టాల్ దగ్గర టీ తాగే సమయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాలు కొట్లాడుకోగా సాయంత్రం పరిగిలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల చాయ్ అడ్డా వద్ద మాట్లాడుకుందామని చెప్పడంతో ఇరువర్గాలు అక్కడికి చేరుకున్నాయి. మాట్లాడుతున్న సందర్భంలో ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు మళ్లీ కొట్లాటకు దిగి ఇష్టం వచ్చినట్లుగా కొట్టుకున్నారు. కూల్‌డ్రింక్స్ బాటిల్స్‌తో చాయ్ అడ్డాలోని వస్తువులతో పరస్పర దాడులకు దిగారు. తద్వారా చాయ్ అడ్డా యజమానికి తీవ్ర నష్టం వాటిల్లింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాల యువకులను సమదాయించారు. ఇదిలావుండగా సోమవారం ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. గంజాయి మత్తులో తమపై దాడికి పాల్పడ్డారంటూ పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

ఇదిలావుండగా రెండు గ్రూపుల యువకులు నానా హంగామా సృష్టించి పరస్పర దాడి కి పాల్పడిన సీసీ టీవీ పుటేజీ బయటకు రావడంతో వైరల్‌గా మారింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండు వర్గాలకు చెందిన 40 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## నేడు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

ధారూరు, ఏప్రిల్ 1: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పంపిణీ చేయనున్నట్లు ధారూరు తహసీల్దార్ షాజిదాబేగం మంగళవారం ఓ ప్రకట నలో తెలిపారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని కెరెళ్లి గ్రామంలో రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తారని, అనంతరం ధారూరు మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

## కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలి



నవాబుపేట, ఏప్రిల్1: మండల పరిధిలోని మైతాబ్ ఖాన్ గూడ గ్రామంలోని ఓ వీధిలోని కరెంట్ స్తంభం శిథిలావస్థకు చేరడంతో దీని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఇది ప్రమాదకరంగా మారడంతో కొత్తది ఏర్పాటు చేయాల్సిందిగా వారు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ Wanted Service Boys & Security Guards to work in Twin Cities. Salary: 15,000/- + ESI & PF. Free Accommodation for Service Boys. Age: up to 35 years. Contact No. 9133377644/45/48.

NT-330673

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**డాక్యుమెంట్లు పోయినవి**

నా పేరు పాతూరి జయమ్మ భర్త పాతూరి శరవానంద్ గౌడ్, నివాసం ఇం.నం. 5-97MP, పటేల్‌గూడ (గ్రా), ఇబ్రహీంపట్నం (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం (మం), పోచారం (గ్రా) వద్ద సర్వే నం. 202, 222, 224 విస్తీర్ణం ఎ. 0.3150 గుంటలలోని వ్యవసాయ భూమి యొక్క ఒరిజినల్ పట్టాదారు పాస్‌బుక్ నం. T05090220725 మరియు లింక్ పట్టాదారు పాస్ బుక్ నం. T05090220710 గల నా డాక్యుమెంట్లు 22-03-2025న ఉదయం 10.30 గంటలకు మంగల్‌పల్లి నుండి పటేల్ గూడ వరకు ప్రయాణిస్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికితే దయచేసి సంప్రదించగలరు. ఫోన్: 9640389966

# స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరుతో మోసం

## నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



సిటీబ్యూరో, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఎలా వస్తాయో సలహాలు చెప్పి లాభాల ఆశచూపి పెట్టుబడులు పెట్టించి లక్షల రూపాయలు కొట్టేసిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాకు చెందిన శివశంకర్ అనే డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్‌చేశారు. హైదరాబాద్‌కు చెం దిన ఒక ప్రైవేటు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ పోలీసులు కేసు నమోదుచేసుకుని నిందితుడిని పట్టుకున్నా రు. బాధితుడికి ఒక నెంబర్ నుంచి వాట్సప్ మెసేజ్ వచ్చిందని, అందులో ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి లాభాలు అర్జించడానికి కావలసిన సలహాలు చెబుతామని, ఇందు కోసం తాము పంపిన లింక్ క్లిక్ చేసి వాట్సప్ గ్రూపులో జాయిన్ అయి పెట్టుబడులు పెట్టాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. ఇన్‌స్టిట్యూషనల్ స్టాక్స్, ఓటీసీ స్టాక్స్, శామ్‌కో గ్రూప్ స్టాక్స్‌లో పెట్టుబడులుపెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చేలా చేస్తామని నమ్మించారు. దీంతో బాధితుడు వారి మాటలు నమ్మి ఆ గ్రూపులో చేరి పెట్టుబడుల రూపంలో రూ. 14,63,046లు తన అకౌంట్‌నుంచి వివిధ అకౌంట్లకు పంపాడు. ఆ తర్వాత లాభాలు చూపించడంతో విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తే అవి కావాలంటే మరిన్ని డబ్బు లు పెట్టుబడి పెట్టాలంటూ చెప్పారని, ఆ తర్వాత వారిని సంప్రదించాలని ప్రయత్నిస్తే స్పందించలేదని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని పట్టుకుని అతని వద్ద రెం డు సెల్‌ఫోన్లు, నాలుగు చెక్‌బుక్స్, 2 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు దేశవ్యాప్తంగా రెండు నేరాల్లో నిందితుడుగా ఉన్నాడని, అందులో ఒకటి తెలంగాణలో ఉందని వారు తెలిపారు.



## రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు

యాలాల, ఏప్రిల్1: తాండూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ తనిఖీలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

# చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్!

వికారాబాద్, ఏప్రిల్ 1: చెడ్డీ గ్యాంగ్ ఆనవాళ్లు వికారాబాద్ పట్టణలో కనిపించడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వికారాబాద్ పరిధిలోని ఆలంపల్లి (ఎంఐజి) రాఘవేంద్ర స్వామి కాలనీలో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తున్న సీసీటీవీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వీళ్ల జాడ సీసీ టీవీ కెమెరాలో చిక్కింది. బనియన్లు, చెడ్డీలు ధరించి, చేతిలో రాడ్‌లు మారణాయుధాలు కత్తులతో చోరీలు చేయడం ఈ గ్యాంగ్ పని. చోరీకి వచ్చేటప్పుడు తమ వెంట రాళ్లను తెచ్చుకుంటారు. ఎవరైనా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై రాళ్లతో దాడి చేస్తారు. వికారాబాద్ పట్టణంలో ఆయా కాలనీ ప్రాం తాల్లో, నిర్మానుష్య ప్రాంతాలను, కాలనీలను టార్గెట్‌గా చేసుకుంటూ చోరీలకు పాల్పడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ చెడ్డీ గ్యాంగ్ వికారాబాద్ పట్టణంలో మార్చి 30వ తేదీ రాత్రి ఓ ఇంట్లో సీసీ కెమెరా పుటేజీకి చిక్కారు. అలంపల్లి ఎమ్ఐజీ రాఘవేంద్రస్వామి టెంపుల్ సమీపంలో ఒక ఇంట్లో భారీ మొత్తంలో నగదు, బంగారం పోయినట్టు చర్చ జరుగుతున్నది.



మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962